క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మార్గశిర మాసం మూడవ శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారికి కాయక ర్పూరం సమర్పించారు. భక్తుల దర్శనార్థం స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హోమస్‌పేట ప్రాథమిక పాఠశాలలో 4, 5వ తరగతుల విద్యార్థులకు శనివారం విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు శేషిరెడ్డి ఆధ్వర్యంలో గణిత, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శేషిరెడ్డి కుమారుడు కొండారెడ్డి, కోడలు నళిని, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైపుల పరిశ్రమలో తనిఖీలు


పైపుల పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామి

మైదుకూరు : మైదుకూరులోని ప్లాస్టిక్ పైపుల తయారీ పరిశ్రమలో శనివారం మున్సిపల్ కమిషనర్ రంగస్వామి తనిఖీలు నిర్వహించారు. స్థానిక బద్వేలు రోడ్డులోని పరిశ్రమల్లో అనుమతులకు సంబంధించిన సర్టిఫికెట్లను, ఇతర శాఖల ఎన్‌ఓసీలను ఆయన పరిశీలించారు. కమిషనర్ వెంట టౌన్ ప్లానింగ్ అధికారి శిరీష తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్రా

గోపవరం : మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా ఉత్సాహంగా కొనసాగుతోంది. వివిధ ఆటలకు సంబంధించిన క్రీడాకారులు పోటాపోటీగా ఆటల్లో పాల్గొంటున్నారు. క్రికెట్ టోర్నమెంట్ పూర్తవగానే కబడ్డీ మొదలుపెట్టారు. శనివారం గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇరుపోటీల మధ్య కబడ్డీ రసవత్తరంగా సాగింది. పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, వలంటీర్లు క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు సమకూర్చారు.

పంచాయతీరాజ్ ఈఈగా నాగరాజు నియామకం



బద్వేలు అర్బన్ : బద్వేలు డివిజన్ పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కర్నాటి నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. నాలుగేళ్లుగా బద్వేలులో పంచాయతీరాజ్ డీఈఈగా పనిచేస్తున్న ఈయన 2022లో నూతనంగా మంజూరైన పంచాయతీరాజ్ డివిజన్‌కు తాత్కాలిక ఈఈగా పనిచేస్తుండేవారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.928 ద్వారా రెగ్యులర్ ఈఈగా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు కల్యాణ మహోత్సవం

వేంపల్లె : లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని బి.ఎర్రగుడి గ్రామంలో వెలసిన శ్రీఓబులేసుస్వామి ఆలయంలో సోమవారం స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వేంపల్లె శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, మానవత స్వచ్ఛంద సంస్థ మండల చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. టీటీడీ దేవస్థానం నుంచి ఆగమ పండితులు అశోకాచార్యులు, మోహన్‌కృష్ణల బృందంచే అభిషేకాలు, అలంకరణలు ఉంటాయన్నారు. చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పండుగలా పింఛన్ పంపిణీ

- కొత్తగా 592 మంజూరు
- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : జనవరి 1 నుంచి పింఛన్‌ను రూ.2750 నుంచి రూ.3 వేలకు పెంచి పంపిణీ చేసే కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. పింఛన్‌దారులను ఒక చోట సమావేశ పరచి పండుగ వాతావరణంలో రూ.3 వేల పింఛన్‌ను అందజేయాలని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు మాట ఇచ్చిన మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని రూ.2750 నుంచి రూ.3 వేలకు పెంచారన్నారు. ఇప్పటి వరకు ప్రొద్దుటూరు అర్బన్ పరిధిలో 12 వేలకు పైగా పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా మరో 592 మంజూరైనట్లు చెప్పారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతో పాటు పార్టీశ్రేణులు పాల్గొనాలని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం గురించి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలోని మైదానంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి లబ్ధిదారులకు మంజూరైన 592 కొత్త పింఛన్లను అందజేస్తామని చెప్పారు.

అజెండాలోని అంశాలు ఆమోదం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అజెండాలో పొందు పరచిన అంశాలను చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి ఆమోదం తెలిపారు. అలాగే టేబుల్ అజెండాలోని అంశాలను కూడా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బంగారు రెడ్డి, ఆయిల్‌మిల్లు ఖాజా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జనవరి 1న ప్రజలకు అందుబాటులో ఉంటా

కరోనా నేపథ్యంలో మూడేళ్ల నుంచి నూతన సంవత్సర వేడుకలకు ఎమ్మెల్యే రాచమల్లు దూరంగా ఉంటూ వచ్చారు. కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు ఈ సారి కొత్త సంవత్సర వేడుకలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఆయన జనవరి 1న ప్రొద్దుటూరులోని తన నివాసంలో ఉదయం 6 గంటల నుంచి అందుబాటులో ఉంటానని చెప్పారు.

సిమెంటు రోడ్డుకు భూమిపూజ

మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డులో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, నాగరాజు, 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు అండగా ఉంటా

నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యం, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అమృతానగర్‌లో పర్యటన

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామపంచాయతీ అమృతానగర్ కాలనీలో ఎమ్మెల్యే రాచమల్లు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్డు సమస్యతోపాటు ఇతర అంశాలను ఆయన దృష్టికి తెచ్చారు. వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాషా, హనుమాన్ రెడ్డి, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 31న అర్ధరాత్రి వీధుల్లో తిరగొద్దు

- రాత్రి 10.30 తర్వాత హోటళ్లు, దుకాణాలు మూసేయాలి
- ఇళ్లల్లోనే నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలి
- ఏఎస్పీ ప్రేరణాకుమార్



ప్రొద్దుటూరు క్రైం : నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31న రాత్రి 10.30 గంటల తర్వాత హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపారాలను నిర్వహించవద్దని ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకలపై శనివారం సాయంత్రం సీఐలతో ఏఎస్పీ సమావేశాన్ని నిర్వహించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా కొత్త సంవత్సర వేడుకలను నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. పోలీసు అధికారుల సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని చెప్పారు.

- 31న రాత్రి 10.30 గంటల తర్వాత యువకులు రోడ్లపైకి రావొద్దు. ప్రజలు అనవసరంగా తిరగడం, ఒక చోట గుమికూడటం చేయరాదు.
- రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు, పోలీసులు వాహనాలను తనిఖీ చేసే సమయంలో ముగ్గురు వ్యక్తులు కలిసి బైక్‌లో ప్రయాణం చేసినా, మద్యం సేవించి పట్టుబడినా కేసులు నమోదు చేస్తాం.
- పట్టణానికి నలువైపులా ఉన్న రింగ్ రోడ్డులో బైక్ రేస్‌లు చేయరాదు, సైలెన్సర్లు లేకుండా బైక్‌లతో రోడ్లపైకి వస్తే వారి వాహనాలను సీజ్ చేస్తాం.
- ముందస్తు అనుమతి లేకుండా పట్టణంలోని పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాల్లో ఈవెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
- బ్లూ కోల్ట్స్, రక్షక్ టీంలతో రాత్రి ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశాం.
- సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన, అసభ్యకరమైన అంశాలను పోస్ట్ చేయరాదు.
- పట్టణంలోని వీధి దీపాలను ధ్వంసం చేయడం గానీ, ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఆస్తులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.
- తల్లిదండ్రులు చిన్న పిల్లలకు బైక్‌లను ఇవ్వరాదు. వారు రాత్రి పూట నడపకుండా నియంత్రించుకోవాలి. ప్రశాంతంగా, ఆనందోత్సాహాలతో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.

బాలికా దినోత్సవంపై వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవిశంకర్

చాపాడు : జనవరి 24న జాతీయ బాలిక దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక మండల రీసోర్స్ కార్యాలయంలో శనివారం సేవ్ ద గర్ల్ చైల్డ్ నార్మ్స్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద పీసీ అండ్ పీఎన్‌డీటీ అక్ట్ పై మూడు అంశాలలో మండలంలోని హైస్కూల్ విద్యార్థిలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పెయింటింగ్ విభాగంలో చాపాడు హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని బి.నాగవేణి, డిబెట్‌లో కస్తూర్బాకు చెందిన 10వ తరగతి విద్యార్థిని రాజేశ్వరి, వ్యాస రచనలో 9వ తరగతి విద్యార్థిని జి.నందిని ప్రథమ స్థానంలో గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థినిలకు మండల విద్యాధికారులు రవిశంకర్, వంశీకృష్ణ బహుమతులు అందజేశారు. గెలుపొందిన విద్యార్థినిలు ఈ నెల 24న కడపలో జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనాలని ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య శ్రీరాముడి అక్షింతలు


శ్రీరాముని అక్షింతలను పంపిణీకి సిద్ధం చేస్తున్న భక్తులు


ఊరేగింపుగా అక్షింతలను తీసుకువస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : భవ్య రామమందిర నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో శ్రీరాముడిని పూజించిన అక్షింతలు ప్రతి హిందువు ఇంటికి అందజేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్ కన్వీనర్ రామకోటిరాజు, అధ్యక్షులు కొండపల్లి వెంకటసుభాష్‌లు తెలిపారు. 5 రోజుల క్రితం బద్వేలుకు చేరుకున్న అక్షింతలను ఇంటింటికి అందించేందుకు వీలుగా శనివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో జరిగే శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ముందుగానే పట్టణంలోని ప్రతి ఇంటికి అక్షింతలతో పాటు శ్రీరాముని ఫొటో అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే మండల పరిధిలోని అబ్బుసాహెబ్‌పేట గ్రామంలో అయోధ్య శ్రీరాముని అక్షింతల శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని బెస్తవీధి, కాపువీధిలలో గానుగపెంట రమేష్‌బాబు ఆధ్వర్యంలో అక్షింతల శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, కార్యక్రమ నిర్వాహకులు గాజునాగరాజు, క్రిష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు చేరిన అయోధ్య అక్షింతలు

కాశినాయన : అయోధ్యలో రామమందిరం నిర్మాణం పూరై 2024 జనవరి 22వ తేదీన రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్, విశ్వహిందూ పరిషత్, జనహిత సంఘాల ఐక్యతతో అయోధ్య నుంచి అక్షింతలు రాష్ట్రాలకు, జిల్లా కేంద్రాలకు, మండల కేంద్రాలకు చేరాయన్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం మండలంలోని బాలరాజుపల్లె, ఆకులనారాయణపల్లె, కొండ్రాజుపల్లె, ఇటుగుల్లపాడు గ్రామాలకు డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజనలతో ఊరేగింపుగా అక్షింతలు చేరుకున్నాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

3 నుంచి లింబ్ ఫిట్‌మెంట్ శిబిరం

ప్రొద్దుటూరు : బెంగళూరు నగరంలో రోటరీ క్లబ్ పీణ్య వారి ఆధ్వర్యంలో జనవరి 3వ తేదీ నుంచి 9 వరకు మెగా లింబ్ ఫిట్‌మెంట్ క్యాంప్(అవయవ అమరిక శిబిరం) నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

రోటరీ బెంగళూరు పీణ్య, శ్రీభగవాన్ మహావీర్ వికలాంగ సాహిత్య సమితి జైపూర్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కృత్రిమ కాళ్లు, చేతులు, పోలియో బాధితులకు కాలిపర్స్ ఉచితంగా అందిస్తామని వివరించారు. అవసరమైన వారు జనవరి 2వ తేదీలోపు ప్రొద్దుటూరులోని రోటరీ క్లబ్‌లో ఆధార్ కార్డు జిరాక్స్ ఇచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

పోరుమామిళ్ల : మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట శనివారం అంగన్‌వాడీలు సమస్యల పరిష్కారం కొరకు సమ్మె చేశారు. ఎండు గడ్డి నోట్లో పెట్టుకుని, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు బొజ్జా చిన్నయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఆహ్వానం

పోరుమామిళ్ల : రాజమండ్రిలో జనవరి 5, 6, 7 తేదీల్లో జరుగనున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి శనివారం ఆహ్వానం అందింది. ఆంధ్ర సారస్వత పరిషత్ మరియు చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మహాసభలకు రావలసిందిగా జిల్లా సంచాలకులు (కవి, రచయిత) బొల్లు రామమోహన్, జిల్లా కార్యవర్గసభ్యులు యంబడి ఈశ్వరయ్య, గురుమూర్తి (కవులు, తెలుగు అధ్యాపకులు) ఆహ్వానపత్రిక అందించారు. అనంతరం కాశినాయన మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, మాజీ మండల అధ్యక్షులు ఎన్.విశ్వనాథరెడ్డికి ఆహ్వానం అందించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రాజుపాళెం : మండలంలోని పర్లపాడు గ్రామానికి చెందిన డేరంగుల బాలనరసింహులు అక్రమంగా అమ్ముతున్న 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజగోపాల్ శనివారం తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

దివ్యాంగురాలికి ట్రైస్కూటర్ వితరణ


మాబుచాన్‌కు తాళాలు అందజేస్తున్న సీవీ సుబ్బారావు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శనివారం సంస్థ ఆధ్వర్యంలో నార్త్ అమెరికా లాస్ ఏంజెల్స్ రాయలసీమ అసోసియేషన్ సహకారంతో అమృతానగర్‌కు చెందిన మాబుచాన్ అనే దివ్యాంగురాలికి రూ.1.50 లక్షల వ్యయంతో ట్రై స్కూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ మాట్లాడుతూ తన చిన్ననాటి మిత్రురాలు పూజ, ఆమె భర్త రాము, లాస్‌ఏంజెల్స్ రాయలసీమ అసోసియేషన్ సహకారంతో ట్రై స్కూటర్‌ను వితరణగా అందించామన్నారు. మాబుచాన్‌కు సంస్థ గౌరవాధ్యక్షుడు సీవీ సుబ్బారావు తాళాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మాధవ, సహాయకార్యదర్శి సాయి, అమరావతి శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి, మల్లికార్జున, శేఖర్, విజయ, మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్ధన్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కలసపాడు : స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం పురోహితులు వారణాసి వెంకటరమణయ్య అర్చకత్వంలో కుంకుమార్చన, గోపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు భజన మండలి వారిచే భజనలు, ధర్మ ప్రచార మండలి సభ్యులు తుపాకుల శ్రీనివాసులుచే రామాయణ, మహాభారత, భగవద్గీతపై ప్రవచనాలు నిర్వహించారు. సందర్భంగా కడప జిల్లా శాఖ నిర్వాహకులు గోపిబాబు మాట్లాడుతూ పవిత్ర ధనుర్మాసం మార్గశిర మాసంలో శ్రీహరి నామస్మరణ మోక్షదాయం, మంగళకరమన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఎన్నిక

స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం జరిగిన అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ కార్యక్రమంలో కలసపాడు మండల హిందూ ధర్మ పరిరక్షణ సమితిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాతా శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.బాలగురయ్య, ఉపాధ్యక్షుడిగా రామలక్షుమయ్య, ఆర్థిక కార్యదర్శిగా రామాంజనేయరెడ్డిలను ఎన్నుకున్నారు.

యువతను సన్మార్గంలో నడిపించాలి


డీవైఎఫ్ఐ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న యుగంధర్

బద్వేలు అర్బన్ : యువతను సన్మార్గంలో నడిపించేందుకు డీవైఎఫ్ఐ నాయకులు కృషి చేయాలని అర్బన్ సీఐ పి.యుగంధర్ తెలిపారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను శనివారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి, వివిధ అంశాలలో వారిలో చైతన్యం నింపేందుకు డీవైఎఫ్ఐ చేస్తున్న కృషి గొప్పదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, నాగార్జున, మహిళా కన్వీనర్ గురుదేవి, కో కన్వీనర్ నాగలక్ష్మి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు

అట్లూరు : రైతుల శ్రేయస్సే లక్ష్యంగా విధులు నిర్వహించాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో శనివారం బద్వేలుతో పాటు అట్లూరు, గోపవరం, సిద్దవటం మండల వ్యవసాయ అధికారులు, ఆయా మండలాల రైతు భరోసా కేంద్ర సహాయకులకు ఒక రోజు శిక్షణ, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ పంటల సాగు, ఈ పంట నమోదు, పంటకోత ప్రయోగాలు, రైతులకు అందుబాటులో ఎరువులు, కిసాన్ డ్రోన్స్ వినియోగం, చిరుధాన్యాల సాగుపై రైతులను చైతన్యపరచడంపై వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వివరించాలన్నారు.

ఎంపీడీఓ వ్యవహార శైలి వివాదాస్పదం

ఎంపీడీఓ, సిబ్బంది ఉన్నతాధికారులకు పరస్పరం ఫిర్యాదులు


ఎంపీడీఓ సాయినాయక్

గోపవరం : ఎంపీడీఓ సాయినాయక్ వ్యవహారశైలి రోజురోజుకు వివాదాస్పదంగా మారింది. వీరపునాయునిపల్లె ఎంపీడీఓగా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై నవంబర్ 27వ తేదీన గోపవరం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ఆర్మీలో పనిచేస్తూ గ్రూప్స్ రాసి ఎంపీడీఓ అయ్యారు. మొట్టమొదట వీరపునాయునిపల్లె ఎంపీడీఓగా నియమితులయ్యారు. అక్కడ ఆయన వ్యవహారశైలి నచ్చకపోవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు అక్కడి నుంచి బదిలీ చేశారు. గోపవరంలో డిప్యూటీ ఎంపీడీఓగా ఈఓపీఆర్‌డీ హసీనా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె స్థానంలో సాయినాయక్‌ను ఎంపీడీఓగా నియమిస్తూ సీఈఓ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆయన గోపవరం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఎంపీడీఓ వర్సెస్ సిబ్బందిగా మండల పరిషత్ కార్యాలయం మారింది. నెల వుదినాల్లో కూడా టెలీకాన్ఫరెన్స్ పేరుతో ఎంపీడీఓ తమను వేధిస్తున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులను కూడా ఏకవచనంతో మాట్లాడటంతో ఎంపీడీఓ మాటలు తమ మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తపరిచారు. ఒకానొక దశలో ఎంపీడీఓను నిలదీసేందుకు మహిళా ఉద్యోగులు కార్యాలయానికి వెళ్లగా ఆయన విధుల్లో లేకపోవడంతో వెనుదిరిగారు. ఇటీవల టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓ సిబ్బందితో మాట్లాడే సమయంలో గోపవరం పంచాయతీ కార్యదర్శి తనను దుర్భాషలాడారని, ఈ విషయంపై నేరుగా ఎంపీడీఓ జిల్లా పరిషత్ సీఈఓకు ఫిర్యాదు చేశారు. తాను ఎంపీడీఓను దుర్భాషలాడలేదని, కావాలనే తమపై ఫిర్యాదు చేస్తున్నారని సిబ్బంది కూడా ఎంపీడీఓపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్య సద్దుమణగక ముందే శనివారం గోపవరం పంచాయతీ కార్యదర్శి విజయకుమార్‌కు ఎంపీడీఓ మెమో జారీ చేశారు. గోపవరం పంచాయతీ కార్యదర్శి టెలీకాన్ఫరెన్స్‌లో తనను దుర్భాషలాడినందుకు ఈ మెమో జారీ చేసినట్లు అందులో పేర్కొన్నారు. ఎంపీడీఓ, సిబ్బంది మధ్య జరుగుతున్న వివాదం సమసిపోవాలంటే ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. గత కొన్ని రోజులుగా జరుగుతున్న వివాదంపై ఎంపీడీఓ సాయినాయక్‌ను వివరణ కోరగా సిబ్బంది తన మాట వినడం లేదని, తనని దుర్భాషలాడినందుకు సీఈఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేడు ముగ్గుల పోటీ

కడప కల్చరల్ : కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు పద్మప్రియ చంద్రారెడ్డి, కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. సంక్రాంతి సంబరాలు 2024లో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. నగర పరిధి ఎర్రముక్కపల్లెలోని శివశివానీ స్కూలు మైదానంలో స్త్రీలకు ముగ్గుల పోటీ నిర్వహిస్తామన్నారు. గంట సమయంలో 4.5 అడుగుల పొడవు, వెడల్పులో ముగ్గు వేయాల్సి ఉంటుందన్నారు. విజేతలకు రూ.10,000, రూ.7500, రూ.5000తోపాటు ఐదుగురికి చీరలను బహుమతిగా ఇవ్వనున్నట్లు వివరించారు.

ముమ్మరంగా మినుము పంట నూర్పిళ్లు


పెద్ద మిషన్‌తో మినుము పంటను నూర్పిడి చేస్తున్న దృశ్యం


మినుములను ట్రాలీలో పోస్తున్న పెద్ద మిషన్

ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన మినుము పంటకు సంబంధించిన నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాజుపాళెం మండలంలోని పలు గ్రామాల్లో ఈ పంట సాగు అయింది. కొందరు పెద్ద మిషన్లతో పంటను పొలంలోనే నూర్పిడి చేస్తుండగా, మరి కొంతమంది కూలీలతో పంటను కోత కోయించి చిన్న మిషన్ల ద్వారా నూర్పిడి చేసుకుంటున్నారు. ఎకరాకు 1 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. 15 రోజుల కిందట క్వింటా రూ.9800 కాగా ప్రస్తుతం రూ.9400 ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

– రాజుపాళెం


మినుములు